# దేవుడు దయచేసిన వనరులు

"తన మహిమను బట్టియు, గుణాతిశయమును బట్టియు, జీవమునకును, భక్తికిని కావలసిన వాటినన్నిటిని మనకు దయచేయుచున్నందున, దేవుని గూర్చినట్టియు, మన ప్రభువైన యేసును గూర్చినట్టియునైన అనుభవజ్ఞానము వలన మీకు కృపయు, సమాధానమును విస్తరించునుగాక". (2 పేతురు 1:2, 3); మనము జీవించుటకును, భక్తిగా ఉండుటకును అవసరమైన వనరులన్నీ దయచేసిన దేవుడు, మన ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన అనుభవజ్ఞానము కలిగి ఉంటే, మనకు కృప, సమాధానము ఎక్కువవుతుందని పేతురు భక్తుడు చెప్తున్న దానినిబట్టి మనము ఈ వనరుల గురించి తెలుసుకుందాము. ముందుగా దేవుడు తాను ఏర్పరచుకున్న ఇశ్రాయేలు ప్రజలకు వారి 40 ఏళ్ల అరణ్య ప్రయాణములో వారికి అవసరమైన వనరులేమి ఇచ్చాడో తెలుసుకొని, అవి ఈనాడు మన జీవితాలలో కూడా ఇచ్చాడని తెలుసుకొని వాటిని మనము ఎలా గుర్తించాలో ధ్యానించుకుందాము. కేవలము అరణ్య ప్రయాణంలోని 40 సంవత్సరాలు మాత్రమే ఇశ్రాయేలు ప్రజలకు దేవుడిచ్చిన వనరులు మనము గుర్తుతెచ్చుకుందాము. ఎందుకంటే ఇశ్రాయేలీయుల అరణ్య ప్రయాణము రక్షణ పొందాక మన జీవితాలలోని ఆత్మీయ ప్రయాణముతో పోల్చవచ్చును. ఇశ్రాయేలీయులు తమకు దేవుడు వాగ్దానము చేసిన కనానులో ప్రవేశించిన తర్వాత ఈ వనరులు లేవు. వాగ్దాన దేశములో ఉన్న సహజ వనరులతో వారు జీవించునట్లు ఏర్పాటు చేశాడు. మన గమ్యమైన పరలోకమును కానానుతో పోల్చవచ్చును. వారు ఆ ప్రయాణములో అవిధేయత చూపించినా ఆ దేవాది దేవుడు తానిచ్చే వనరులు ఆపలేదు. అది మనకు కూడా అన్వయించుకోవచ్చును. రక్షణలోని మొదటి మెట్టు పాప శిక్షనుండి విడుదల. ఈ మొదటి క్షణంలోనే మనము దేవుని బిడ్డలుగా చేయబడుతాము. కాబట్టి తప్పు ఏమైనా చేసినను, అడిగితే మనకు క్షమాపణ దొరుకుతుంది. దేవుడు ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వము నుండి బయటకు తెచ్చాడు. మనలను పాపపు దాస్యము నుండి విడిపించాడు. ఈ ఆత్మీయ ప్రయాణములో, ఇశ్రాయేలీయులకు అరణ్య ప్రయాణములో ఇచ్చిన వనరులు మనకు ఎలా ఇవ్వబడ్డాయో చూద్దాము. మన జీవితములో అవి అన్వయించుకొనే విధానాన్ని పరిశీలిద్దాము. రక్షణ పొందిన క్షణము నుండి మనకు ఈ వనరులన్నీ ఇవ్వబడుతాయని మనము గుర్తించాలి.

## 1. మేఘస్తంభము

నిర్గమ 13:21 లో "యెహోవా త్రోవలో వారిని నడిపించుటకై పగటివేళ మేఘ స్తంభములో" ఉండి నడిపించాడని వ్రాయబడి ఉన్నది. హెబ్రీ 12:1,2 లో "ఇంత గొప్ప సాక్షి సమూహము మేఘము వలె మనలను ఆవరించి యున్నందున, మనము కూడ ప్రతి భారమును, సుళువుగా చిక్కులు బెట్టు పాపమును విడిచిపెట్టి, విశ్వాసమునకు కర్తయు, దానిని కొనసాగించు వాడునైన యేసువైపు చూచుచు, మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికగా పరుగెత్తుదము" అని వ్రాయబడి ఉన్నది. హెబ్రీ 11వ అధ్యాయములో లేఖనాలలోని గొప్ప విశ్వాసుల గురించి తెలిపి, అటువంటి వారు మీకు మార్గదర్శకులై ఉండాలి అన్నట్లు చెప్పాడు. ఆనాడు ఇశ్రాయేలీయులను నడిపించుటకు మేఘస్తంభమును పెట్టినట్లు, ఈనాడు తోటి విశ్వాసుల యొక్కయు, బైబిలులోని విశ్వాస వీరుల యొక్కయు సాక్ష్యమును బట్టి మనము నడవాలని ఏర్పరచాడు.

## 2. అగ్నిస్తంభము

నిర్గమ 13:21 లో "వారికి వెలుగిచ్చుటకు రాత్రివేళ అగ్ని స్తంభములోను ఉండి వారికి ముందుగా నడచుచు వచ్చెను" అని వ్రాయబడి ఉంది. ఈ అగ్ని స్తంభమును మనలో ఉన్న పరిశుద్ధాత్మ దేవునితో పోల్చవచ్చును. "పరిశుద్ధాత్మ మీ మీదకు వచ్చినప్పుడు మీరు శక్తి నొందెదరు" అ.కా. 1:8; అని ప్రభువు చెప్పాడు. ఆ శక్తితోనే మన ఆత్మీయ నడక కొనసాగించ గలము. అపొ.కా. 2:3లో ప్రభువుచెప్పినట్లుగా శిష్యుల మీదకు అగ్ని జ్వాలల వంటి నాలుకలు వ్రాలగా "అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై, ఆ ఆత్మ వారికి వాక్శక్తిని అనుగ్రహించిన కొలది అన్యభాషలతో మాట్లాడసాగిరి". ఆయన మనలో, మనముందు ఉండి నడిపిస్తాడు.

## 3. నీరు

నిర్గమకాండము 15:27 లో నీటిబుగ్గలున్న చోట ఇశ్రాయేలీయులు విడిది చేసిరని చెప్పబడి ఉంది. మనకు దేవుడను గ్రహించిన లేఖనాలను నీటితో పోల్చవచ్చును. "నేనిచ్చు నీళ్లు త్రాగువాడెప్పుడును దప్పిగొనడు". యోహాను 4:14; ఆ "జీవజలము నేడు చెప్తున్నాడు. వాక్యమనే నీటితో మనలను మనము పరీక్షించుకొని, "నిర్మలమైన ఉదకముతో స్నానము చేసిన శరీరములు గలవారై" హెబ్రీ 10:22 లో అంటున్నాడు. ఇశ్రాయేలీయులు పయనములో చేదు నీటిని దేవుడు మధురముగా మార్చాడు. వాక్యముతో మన జీవితములలోని చేదు మధురముగా మార్చబడుతుంది.

## 4. మన్నా

నిర్గమకాండము 16:35 లో "ఇశ్రాయేలీయులు నివసింపవలసిన దేశమునకు తాము ప్రయాణించిన నలువది యేండ్లు మన్నానే తినుచుండిరి. వారు కనాను దేశపు పొలిమేరలు చేరు వరకు మన్నాను తినిరి" అని వ్రాయబడి ఉంది. "జీవాహారము నేను, నా యొద్దకు వచ్చువాడు ఏ మాత్రమును ఆకలిగొనడు". యోహాను 6:35 అని యేసయ్య అంటున్నాడు. ఇశ్రాయేలీయులకిచ్చిన మన్నా కంటే శ్రేష్ఠమైన యేసయ్యను ఇప్పుడు దేవుడు మనకిచ్చియున్నాడు. యోహాను 6:56-58 లో "నా శరీరము తిని, నా రక్తము త్రాగువాడు నాయందును, నేను వానియందును నిలిచి యుందుము. జీవముగల తండ్రి నన్ను పంపెను గనుక నేను తండ్రి మూలముగా జీవించుచున్నట్లే నన్ను తినువాడును నా మూలముగా జీవించును. ఇదే పరలోకము నుండి దిగివచ్చిన ఆహారము, పితరులు మన్నాను తినియు చనిపో యినట్లు గాదు. ఈ ఆహారము తినువాడు ఎల్లప్పుడును జీవించునని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాననెను" అని వ్రాయబడి ఉన్నది. ఆయనను తినుట అంటే వాక్యము రోజూ ధ్యానించుట, మన్నాను ఇశ్రాయేలీయులు ఏ రోజుకారోజు పోగుచేసుకోవాలి.

## 5. వస్త్రాలు పాతగిలలేదు

ద్వితీయోపదేశకాండము 8:4 లో "ఈ నలువది సంవత్సరములు నీవు వేసికొనిన బట్టలు పాతగిలలేదు" అంటున్నాడు దేవుడు. ఈనాడు ప్రభువు మనకిచ్చు నీతివస్త్రములు పాతగిలవు, చిరిగిపోవు. ఎందుకంటే నీతివస్త్రము ధరించిన మనము నిత్యజీవమునకు వారసులమవుతాము. "అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను దానిని తినివేయదు". మత్తయి 6:20; పౌలు తన పత్రికలో పలు చోట్ల "క్రీస్తును ధరించుకొనుడి"అంటున్నాడు. ఆయన సారూప్యములోనికి మనము మారాలి. మనకు ఈ నీతివస్త్రములు కావాలంటే మన పరమతండ్రిని అడగాలి. "అడుగుడి, ఇవ్వబడును" అని దేవుడు మనకు ఎప్పుడూ తెరచి ఉంచిన ఆహ్వానము అందజేస్తున్నాడు.

## 6. సంపూర్ణ ఆరోగ్యము

నిర్గమకాండము 15:26 లో "నేను ఐగుప్తీయులకు కలుగజేసిన రోగములలో ఏదియు మీకు రానియ్యను, నిన్ను స్వస్థపరచు యెహోవాను నేనే" అన్నాడు. ద్వితీ. 8:4లో "నీ కాలు వాయలేదు" అంటున్నాడు. 40 సంవత్సరములు ప్రయాణము చేసినను వారికి ఏ రోగము రాలేదు, కనీసము కాళ్లవాపు కూడా రాలేదు. వాగ్దానము చేసినవాడు నమ్మదగిన దేవుడు. ఇశ్రాయేలీయుల దీర్ఘకాల ప్రయాణములో పరిసరాలు, వాతావరణ, భౌగోళిక మార్పులు ఉన్నను, మామూలుగా వాటి వలన వచ్చు ఏ అనారోగ్యము రాలేదు. ఈనాడు మనము కూడా ఆరోగ్యముగా ఉండాలని దేవుని చిత్తమై ఉన్నది. 2తిమోతి 4:3 లోను, తీతుకు 2:1-3 లోను ఆరోగ్యకరమైన బోధ చేయాలి, వినాలి అని పౌలు తన శిష్యులతోను, మనతోను చెప్తున్నాడు. "అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది" యెషయా 53:5; అను వాక్య ప్రకారము విశ్వాసముతో ప్రార్థించినప్పుడు స్వస్థత కలుగుచున్నది.

## 7. చెప్పులు

ద్వితీ. 29:5 లో "మీ చెప్పులు మీ కాళ్లను పాతగిలిపోలేదు" అని దేవుడు ఇశ్రాయేలీయులతో అంటున్నాడు. అపొ.కా. 12:8 లో "చెప్పులు తొడుగుకొనుమని" దూత పేతురుతో చెప్తున్నాడు. ఈ 'చెప్పులు' అనేవి సువార్తను బోధించువారు పాదములకు సాదృశ్యముగా ఉన్నవి. దూత పేతురుకు తానే స్వయంగా చెప్పులు తొడిగించి ఉండవచ్చు, కాని మనమే తొడుక్కోవాలన్నది దేవుని ప్రణాళిక. సువార్త ప్రకటించుట మొదలు పెడితే దేవుడు చేసే అద్భుతాలు మన జీవితంలో చూడవచ్చును. ఇంతవరకు మనము ధ్యానించుకున్న విషయాలు అద్భుతంగా ఉన్నాయి కదండీ! దాదాపు 4000 సం॥ క్రిందట జరిగినవే ఈనాడు జరుగుతున్నాయి. నిన్న, నేడు, నిరంతరము ఏకరీతిగా ఉన్న దేవుని కలిగియున్న మనము ధన్యులము. ఈ గొప్ప దేవుని ఎల్లవేళలా హత్తుకొని ఉండాలని ప్రభువు పేరట కోరుతూ ముగిస్తాను. ఆమేన్